ఆదివారం

14-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 393, పేజీలు: 4 | ₹6


EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com




## అభ్యంతకర పోస్టు చేసిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్

మిగతా 3లో



## రైల్లో వెయిటింగ్ లిస్ట్‌కు కొత్త రూల్

మిగతా 2లో



## డ్రగ్స్‌ను నిర్మూలనకు ప్రభుత్వం కొత్త వ్యూహం

మిగతా 2లో



## పావురాల ఈకలు, రెట్టలతో అనారోగ్యం

మిగతా 4లో

# ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టిందే కాంగ్రెస్

- భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కోర్సులు ఉండాలి
- జేఎన్‌టీయూలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ముందడుగు హైదరాబాద్:
దేశంలో మొదటి సారిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశ పెట్టింది కాంగ్రెస్ పార్టీ అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన 'నాణ్యమైన ఇంజినీరింగ్ విద్య' కార్యక్రమంలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జేఎన్‌టీయూ పరిధిలో కళాశాలల నిర్వాహకులకు ప్రభుత్వ విధానం తెలియాలి. ప్రభుత్వ విధానాలు అందరికీ తెలిసే విధంగా ప్రస్తుత కార్యక్రమం ఏర్పాటు చేశాం. ప్రతి విషయంలో ప్రభుత్వ విధానం కీలకం. ఈ విద్యాసంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు లేకుండా చూస్తాం. నిరుద్యోగులను తయారు చేసే పరిశ్రమలుగా కళాశాలలు ఉండ కూడదు. అభివృద్ధి చెందుతున్న దేశానికి అత్యంత అవసరమైంది సివిల్ ఇంజినీరింగ్. కొన్ని కళాశాలల్లో సివిల్ ఇంజినీరింగ్‌ను లేకుండా చేసే విధంగా ప్రణాళికలు చేస్తున్నారు. కళాశాలల్లో సివిల్,

మిగతా 2లో




## ఉప ఎన్నికల్లో ఇండియా కూటమిదే హవా

- 10 చోట్ల విజయం సాధించిన విపక్ష కూటమి
- రెండు స్థానాలకే పరిమితమైన బిజెపి
- మరో చోట స్వతంత్ర అభ్యర్థి గెలుపు

ముందడుగు జాతీయం:
దేశంలో 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో విపక్ష కూటమి 10 చోట్ల విజయం సాధించింది. బిజెపి రెండు స్థానాలకు పరిమితమైంది. మరో చోట స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. పశ్చిమ బెంగాల్‌లోని 4, హిమాచల్ ప్రదేశ్‌లోని మూడు, ఉత్తరాఖండ్‌లోని రెండు, పంజాబ్, బిహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లోని ఒక్కో స్థానానికి జులై 10న

మిగతా 2లో

## 56 ఏళ్ల వయస్సులో కేంద్రమంత్రి స్కై డైవింగ్

### సాహసం చేసిన గజేంద్ర సింగ్ షెకావత్




ముందడుగు హరియాణా:
56 ఏళ్ల వయసులో కేంద్ర పర్యటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అరుదైన సాహసం చేశారు. భారత దేశంలో ప్రైవేటు రంగంలో మొట్టమొదటి స్కై డైవింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భాన్ని ఇలా సెలబ్రేట్ చేసుకున్నారు. భారత్‌తో

మిగతా 2లో



## సొంత పార్టీని హెచ్చరించిన నితిన్ గడ్కరీ

### కాంగ్రెస్ చేసిన తప్పిదాలు మనం చెయొద్దు

### ఎల్‌కే అద్వానీ వ్యాఖ్యలను గుర్తు చేసిన కేంద్రమంత్రి

ముందడుగు జాతీయం:
సొంత పార్టీని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హెచ్చరించారు. కాంగ్రెస్‌ను అధికారం నుంచి గద్దె దింపడానికి దారితీసిన తప్పిదాలను బీజేపీ పునరావృతం చేయవద్దని, భిన్నత్వం ఉన్న పార్టీ బీజేపీ అన్న ఎల్‌కే అద్వానీ వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. శుక్రవారం గోవాలో జరిగిన పార్టీ అత్యున్నత స్థాయి సమావేశంలో నితిన్ గడ్కరీ మాట్లాడారు.

మిగతా 2లో

ముందడుగు
ఆదివారం, 14-7-2024, హైదరాబాద్.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టిందే కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులను కచ్చితంగా నడపాలి. ఈ కోర్సులు లేకపోతే దేశం ప్రమాదాన్ని ఎదుర్కొంటుంది.

**ప్రపంచంతో పోటీపడుదాం**

గత సీఎంలు తీసుకున్న విధానాల వల్ల మనం ఐటీ, ఫార్మా రంగాల్లో ముందున్నాం. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కోర్సులు ఉండాలి. ఫార్మా, ఐటీ తర్వాత ఏఐ ప్రపంచాన్ని నడిపించబోతోంది. రాష్ట్రంలోని కళాశాలల్లో ఏఐకి సంబంధించిన కోర్సు ప్రవేశపెట్టాలి. ప్రభుత్వం కూడా అందుకు ప్రోత్సహిస్తుంది. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి అటానమస్ హోదా ఇస్తాం. పక్క రాష్ట్రాలతో పోటీ పడే విధంగా కాకుండా ప్రపంచంతోనే పోటీ పడే విధంగా మనం తయారు కావాలి. మా ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోంది. అందుకోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది" అని సీఎం వివరించారు. మంత్రి శ్రీధర్‌బాబు, జేఎన్‌టీయూ వీసీ బుర్రా వెంకటేశం, ఇంజనీరింగ్ కాలేజీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

# ఉప ఎన్నికల్లో ఇండియా కూటమిదే హవా

మొదటిపేజీ తరువాయి

ఉప ఎన్నిక పోలింగ్ జరిగింది. ఇందులో నాలుగు రాష్ట్రాల్లో ఇండియా కూటమి అధికారంలో ఉండగా.. మరో మూడుచోట్ల ఎన్డీయే ప్రభుత్వం ఉంది. శనివారం కౌంటింగ్ చేపట్టి ఫలితాలను ప్రకటించారు.

**విజయం సాధించిన సీఎం సతీమణి..**

హిమాచల్ ప్రదేశ్‌లోని దేహ్రాలో రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సతీమణి, కాంగ్రెస్ అభ్యర్థి కమలేశ్ ఠాకూర్ విజయం సాధించారు. తన సమీప భాజపా అభ్యర్థిపై 9వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నాలాగఢ్ స్థానంలో కాంగ్రెస్ నేత హర్‌దీప్ సింగ్ బవా 8,990 ఓట్ల తేడాతో భాజపా అభ్యర్థిపై విజయం సాధించారు. ఇక, హమీర్‌పూర్ స్థానంలో భాజపా అభ్యర్థి ఆశీష్ శర్మ గెలుపొందారు.

**బెంగాల్‌లో మమతా పార్టీదే విజయం..**

పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొంది జోరుమీదున్న తృణమూల్ కాంగ్రెస్.. తాజా ఉప ఎన్నికల్లోనూ హవా కొనసాగించింది. ఇక్కడ రాయ్‌గంజ్, రాణాఘాట్, బాగ్దా, మాణిక్‌తలా.. నాలుగు స్థానాల్లోనూ టీఎంసీ అభ్యర్థులు విజయం సాధించారు. ఇక, ఉత్తరాఖండ్‌లో మంగళౌర్, బద్రీనాథ్ స్థానాలను కాంగ్రెస్ దక్కించుకుంది.

**పంజాబ్ బైపోల్ ఆప్‌దే..**

పంజాబ్‌లోని జలంధర్ స్థానంలో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి మోహిందర్ భగత్ విజయం సాధించారు. తన సమీప భాజపా అభ్యర్థి శీతల్‌పై 37వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. తమిళనాడులోని విక్రావండి స్థానంలో డీఎంకే అభ్యర్థి అన్నియూర్ శివ విజయం సాధించారు. మధ్యప్రదేశ్‌లోని అమర్‌వాడాలో భాజపా నేత కమలేశ్ షా గెలుపొందారు. బిహార్‌లోని రూపౌలి స్థానంలో స్వతంత్ర అభ్యర్థి శంకర్ సింగ్ జయకేతనం ఎగురవేశారు.

# 56 ఏళ్ల వయస్సులో కేంద్రమంత్రి స్కై డైవింగ్

మొదటిపేజీ తరువాయి

పాటు ఈ ప్రపంచానికి ఈ రోజు అతిముఖ్యమైనది. హరియాణాలోని నార్నౌల్‌లో ఈ కేంద్రం ఏర్పాటైంది. దేశ పర్యటక శాఖ మంత్రిగా ప్రజలకు ఈ తరహా సదుపాయాలు అందుబాటులో ఉంచడం నా బాధ్యత" అని మీడియాతో మాట్లాడారు. అలాగే తాను స్కై డైవింగ్ చేసిన చిత్రాలను ఎక్స్(ట్విటర్) వేదికగా షేర్ చేశారు. "ఆ థ్రిల్‌ను నేనూ ఎంజాయ్ చేశాను. భారత పర్యటక రంగం అంతర్జాతీయ వసతులను పొందుతున్నందుకు సంతోషంగా ఉంది" అంటూ పోస్టు పెట్టారు. స్కై డైవింగ్ ఎంతో సాహసంతో కూడుకున్న ఓ విన్యాసం. మొదటి, రెండో ప్రపంచ యుద్ధంలో సైనికులు అవసరాన్ని బట్టి ప్యారాచూట్ జంప్ చేసేవారు. ఇటీవలి కాలంలో సామాన్యులు సైతం స్కై డైవింగ్ చేస్తున్నారు.

# సొంత పార్టీని హెచ్చరించిన నితిన్ గడ్కరీ

మొదటిపేజీ తరువాయి

అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుల వల్లనే ప్రజలు బీజేపీని ఎన్నుకున్నారని తెలిపారు. 'కాంగ్రెస్ చేసిన పనిని మనం కొనసాగిస్తే, (అధికారం నుంచి) వారి నిష్క్రమణ, మన ప్రవేశం వల్ల ప్రయోజనం ఉండదు' అని అన్నారు. తన గురువు, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ వ్యాఖ్యలను ఈ సందర్భంగా నితిన్ గడ్కరీ ప్రస్తావించారు. 'మనది భిన్నత్వం ఉన్న పార్టీ అని అద్వానీ చెప్పేవారు. ఇతర పార్టీల కంటే మనం ఎంత భిన్నంగా ఉన్నామో అర్థం చేసుకోవాలి' అని అన్నారు. మరోవైపు రాబోయే రోజుల్లో దేశంలో సామాజిక, ఆర్థిక సంస్కరణలు తీసుకురావడానికి రాజకీయాలు ఒక సాధనమని, పార్టీ కార్యకర్తలు ఇది తెలుసుకోవాలని నితిన్ గడ్కరీ తెలిపారు. సొంత రాష్ట్రమైన మహారాష్ట్ర రాజకీయాలను ఆయన ప్రస్తావించారు. కుల ప్రాతిపదికన రాజకీయాలు చేయకూడదని సూచించారు. 'ఈ ధోరణిని అనుసరించకూడదని నేను నిర్ణయించుకున్నా. కుల ఆధారిత రాజకీయాలు చేయబోనని ప్రజలకు చెప్పా. కులం గురించి మాట్లాడే వారికి బలమైన కిక్ వస్తుంది' అని అన్నారు. అలాగే అవినీతి రహిత దేశాన్ని సృష్టించడానికి సరైన ప్రణాళిక చేయాలని పార్టీకి పిలుపునిచ్చారు.



# డ్రగ్స్‌ను నిర్మూలనకు ప్రభుత్వం కొత్త వ్యూహం

## పాఠశాలలో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు

ముందడుగు తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు కాంగ్రెస్ప్రభుత్వం సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తోంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆదేశాలు జారీ చేశారు. పిల్లలను మాదకద్రవ్యాల దుర్వినియోగం నుంచి దూరం చేయడానికి ప్రహరీ క్లబ్ లు ఏర్పాటుచేయనున్నారు.

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ అధ్యక్షుడిగా హెడ్ మాస్టర్ లేదా ప్రిన్సిపాల్ ఉంటాడు. వైస్ ప్రెసిడెంట్‌గా సీనియర్ టీచర్ లేదా ఫ్రెండ్లీ టీచర్ ఉంటారు. 6 నుంచి పదో తరగతి వరకు ప్రతి క్లాసు లో ఇద్దరు విద్యార్థులు స్థానికంగా ఉండే పోలీస్ స్టేషన్ నుంచి ఒక పోలీస్.. పేరెంట్స్ నుంచి ఒకరు ప్రహరీ క్లబ్ లో సభ్యులుగా ఉంటారు. పిల్లలు మత్తు పదార్థాలుగా ఉపయోగించే ఔషధ మందులు, పదార్థాలు.. ఇతర రకాల వస్తువులు చేరకుండా నిరోధించడానికి ఈ క్లబ్ లు ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం త్వరలోనే పూర్తి గైడ్ లైన్స్ విడుదల చేయనుంది.

# రైల్లో వెయిటింగ్ లిస్ట్‌కు కొత్త రూల్

- రిజర్వేషన్ బోగీలో ప్రయాణించడం నిషేధం
- జరిమానాతో పాటు, మధ్యలో దింపేయవచ్చు



ముందడుగు రైల్వే: భారతీయ రైల్వేల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. రైలు టికెట్ రిజర్వేషన్ చేసుకున్న వారిలో చాలా మంది వెయిటింగ్ లిస్ట్ టిక్కెట్లు ఉన్న వారు ఉంటారు. తమ టికెట్ వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నవారు కొన్నిసార్లు నిలబడే జర్నీ చేస్తారు. అయితే రైల్వే శాఖ జూలై 1 నుంచి రైల్వేశాఖ ఈ నిబంధనలను అమలులోకి తీసుకురాగా, వెయిటింగ్ టిక్కెట్ల విషయంలో కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నిబంధనను ఉల్లంఘిస్తే, జరిమానా విధించబడడమే కాకుండా, రైల్వే టిటిఈ ప్రయాణికుడిని మధ్యలోనే ట్రైన్ దింపే అవకాశం ఉందని చెపుతోంది.

**రైల్వే కొత్త నిబంధన**

వెయిటింగ్ లిస్ట్ టిక్కెట్లపై రిజర్వేషన్ కోచ్‌లలో ప్రయాణించడాన్ని ఇప్పుడు పూర్తిగా నిషేధించింది. అంటే మీ టికెట్ వేచి ఉండి ఉంటే, మీరు AC లేదా స్లీపర్ కోచ్‌లో ప్రయాణించలేరు. మీరు స్టేషన్ విండో నుండి టిక్కెట్‌ను ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసినప్పటికీ. ఈ తరహా టిక్కెట్‌పై రిజర్వ్ చేసిన కోచ్‌లలో ప్రయాణించడాన్ని రైల్వే ఇప్పుడు నిషేధించింది. రిజర్వ్ చేసిన కోచ్‌లలో కన్ఫర్మ్ చేసిన టిక్కెట్లతో ప్రయాణించే వారి సౌకర్యార్థం ఈ నిర్ణయం అమలులోకి వచ్చినప్పటికీ, వెయిటింగ్ టిక్కెట్‌పై ప్రయాణించే లక్షల మంది ప్రయాణికులపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వెయిటింగ్ టికెట్ ఉన్న ప్రయాణికులు రిజర్వ్‌డ్ కోచ్‌లలో జర్నీ చేస్తే టీటీ అతడిపై రూ.440 ఫైన్ వేసి, దారిలో రైలు నుంచి దిగేలా చేయవచ్చని రైల్వే తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ముందడుగు
ఆదివారం, 14-7-2024, హైదరాబాద్.

# మోడీ చర్యలపై మండిపడ్డ ప్రియాంక

- రాజ్యాంగ హత్యాదినంపై ఆగ్రహం
- అలా ప్రకటించడంతో ఆశ్చర్యం లేదని వెల్లడి

ముందడుగు జాతీయం: కేంద్ర ప్రభుత్వం జూన్ 25ను ఇకపై ఏటా 'రాజ్యాంగ హత్యాదినం' (సంవిధాన్ హత్యాదివస్)గా జరుపుకోవాలని తీసుకున్న కీలక నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ స్పందించారు. మోడీ సర్కార్ తీసుకున్న చర్యలపై మండిపడ్డారు. రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు ఇలా చేయడంలో వింతేమీ లేదని అని విమర్శలు గుప్పించారు. దేశంలోని గొప్ప వ్యక్తులు కలిసికట్టుగా స్వాతంత్ర్యాన్ని మాత్రమే కాకుండా రాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. కానీ,




కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎప్పటి నుంచో రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తోంది. దాన్ని రద్దు చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు 'సంవిధాన్ హత్యాదివస్' ప్రకటించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. రాజ్యాంగంపై విశ్వాసం ఉన్నవారు మాత్రమే పరిరక్షణ కోసం పోరాడుతున్నారు అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.

# రూ.773.8 కోట్ల లాభాన్ని సాధించిన డీమార్ట్

## కొత్తగా మరో ఆరు స్టోర్లు ప్రారంభం

ముందడుగు జాతీయం: రోజురోజుకు వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్న డీ-మార్ట్ లాభాల బాటలో దూసుకుపోతుంది. డీ-మార్ట్ పేరిట రిటైల్ చైన్‌ను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జూన్ త్రైమాసిక ఫలితాలను వెలువరించింది. తొలి త్రైమాసికంలో రూ.773.8 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది లాభం రూ.659 కోట్లతో పోలిస్తే 17.5 శాతం వృద్ధి నమోదైందని తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. కంపెనీ ఆదాయం సైతం 18.6 శాతం వృద్ధితో రూ.14,069 కోట్లుగా నమోదైంది.






సమీక్షా త్రైమాసికంలో డీమార్ట్ ఎబిటా 18 శాతం పెరిగి రూ.1221.3 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇది రూ.1035.3 కోట్లుగా ఉంది. కంపెనీ మార్జిన్ 8.68 శాతంగా ఉంది. ఇదే త్రైమాసికంలో డీమార్ట్ కొత్తగా మరో ఆరు స్టోర్లను తెరిచింది. దీంతో జూన్ చివరి నాటికి మొత్తం స్టోర్ల సంఖ్య 371కి చేరింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో శుక్రవారం బీఎస్ఈలో అవెన్యూ సూపర్‌మార్ట్స్ షేరు 1.15 శాతం లాభంతో రూ.4953 వద్ద ముగిసింది.

# అభ్యంతకర పోస్టు చేసిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్

- అమరవీరుడి భార్యపై కామెంట్ చేసిన వ్యక్తి
- చర్యలు తీసుకున్న జాతీయ మహిళా కమిషన్

ముందడుగు జాతీయం: దేశంకోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుడి భార్యపై అభ్యంతరకర పోస్టు చేసిన నెటిజన్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శనివారం దీనిపై కేసు నమోదైంది. జాతీయ మహిళా కమిషన్ చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. ఆ కామెంట్లు చేసిన నెటిజన్ అకౌంట్ వివరాల కోసం సంబంధిత సోషల్ మీడియా సంస్థను సంప్రదించినట్లు తెలిపారు.

దేశం కోసం ప్రాణాలు అర్పించిన భారత సైనికుడు అంశుమాన్ సింగ్ త్యాగానికి గుర్తుగా భారత ప్రభుత్వం కీర్తి చక్ర అవార్డును ప్రకటించింది. ఇటీవల ఆయన సతీమణి స్మృతిసింగ్ రాష్ట్రపతి చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఆ వీడియో సోషల్






మీడియాలో పోస్ట్ చేయడంతో యావత్ భారతదేశం అమరవీరుడి కుటుంబాన్ని కీర్తించింది. అవార్డు స్వీకరించే సమయంలో స్మృతి ముఖం చూసిన దేశ ప్రజల కళ్లూ చెమర్చాయి. కానీ కొందరు మాత్రం ఆ వీడియోపై అభ్యంతరకర కామెంట్లు పెట్టడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఢిల్లీకి చెందిన అహ్మద్ అనే వ్యక్తి అసభ్యకరంగా చేసిన కామెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు జాతీయ మహిళా కమిషన్‌ను కోరారు. దీనిపై స్పందించిన మహిళా కమిషన్ ఆ యువకుడి చర్యను తీవ్రంగా ఖండించింది. దిల్లీ పోలీసులు తక్షణమే అతడిని అరెస్టు చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# మహిళలపై అసభ్యకర పోస్టులు పెట్టొద్దు

## ఐదు యూట్యూబ్ ఛానళ్లను రద్దు

## మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ నిర్ణయం

ముందడుగు హైదరాబాద్ వ్యక్తిగత విమర్శలు, అసత్య వార్తలను పోస్ట్ చేస్తున్న ఐదు యూట్యూబ్ ఛానళ్లను రద్దు చేయించినట్లు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) తెలిపింది. ఇది ఆరంభం మాత్రమేనని, భవిష్యత్‌లో ఇలాంటి ఛానళ్లపై చర్యలు కొనసాగుతాయని ఎక్స్‌వేదికగా పోస్ట్ చేసింది. జస్ట్ వాచ్ బీబీసీ, ట్రోల్స్ రాజా, బచినా లలిత్, హైదరాబాద్ కుర్రాడు, ఎక్స్‌వైజెడ్ఎడిట్007 యూట్యూబ్ ఛానళ్లు రద్దు చేసిన జాబితాలో ఉన్నాయి.

హీరోహీరోయిన్లను విమర్శిస్తూ చేసిన వీడియోలను, కామెంట్లను 48గంటల్లో తొలగించాలంటూ డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కు 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఇటీవల విజ్ఞప్తి చేశారు. ట్రోలింగ్




వీడియోలను డిలీట్ చేయకపోతే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల ఓ తండ్రి-కుమార్తెపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ వీడియో పోస్ట్ చేసిన యూట్యూబర్లపై విష్ణు మండిపడ్డారు. మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే ఊరుకోబోమన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. ''ట్రోలింగ్ వీడియోలు చేసే వారికి, అసభ్యకరమైన వీడియోలు చేసే వారికి ఒక 48 గంటలు మాత్రమే సమయం ఇస్తున్నా. దయచేసి అలాంటి వీడియోలన్నీ తక్షణమే తొలగించండి. ఒకవేళ మీరు తొలగించకపోతే సైబర్ సెక్యూరిటీకి ఫిర్యాదు చేస్తాం.అలాగే మీ యూట్యూబ్ ఛానళ్లు బ్యాన్ అయ్యేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముందడుగు
ఆదివారం,
14-7-2024,
హైదరాబాద్.

### నడుస్తున్న రైలుపై రాళ్లు రువ్విన

# ఆకతాయిలు

## భయాందోళనకు గురైన ప్రయాణీకులు

ముందడుగు మహారాష్ట్ర:
నడుస్తున్న రైలుపై మార్గమధ్యలో కొందరు ఆకతాయిలు రాళ్లు రువ్వారు. దీంతో ప్రయాణీకులు భయాందోళనలకు గురయ్యారు. మహారాష్ట్రలో శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. మహారాష్ట్రలోని జల్‌గావ్ సమీపంలోని ఓ రైల్వే స్టేషన్ మీదుగా రైలు వెళ్తున్న సమయంలో కొందరు ఆకతాయిలు ఒక్కసారిగా రైలుపై రాళ్లు రువ్వడం ప్రారంభించారు. వారు ఆగ్రహావేశాలతో అరుస్తూ రైలుపై రాళ్ల దాడి చేశారు. ఇలా రాళ్లు విసిరిన వారిలో మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. వాళ్లు ఎందుకు దాడి చేస్తున్నారో అర్థంకాక అయోమయంలోనే ప్రయాణికులు భయంతో కిటికీలు, డోర్లు మూసుకున్నారు.

ఈ ఘటనను రైలులో ఉన్న వ్యక్తులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అకస్మాత్తుగా రైలుపై రాళ్ల దాడి జరిగిందని, ఈ దాడికి కారణాలు తెలియదని, దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఈ వీడియోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఘటనపై నెటిజన్లు స్పందిస్తూ.. ఇది మాములు సంఘటన కాదని, సమాజం యొక్క శాంతిభద్రతలను సవాలు చేసే సంఘటన అని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు చేపట్టాలని కామెంట్లు చేస్తున్నారు.

### అప్పు కింద బాలికను

# అమ్మిన పెద్దమ్మ

- బాలికతో బాతులు మేపిస్తున్న వ్యక్తి
- పోలీసులను ఆశ్రయించిన బాలిక తల్లి



ముందడుగు ఆంధ్రప్రదేశ్:
వేసవి సెలవుల కోసం పెద్దమ్మ ఇంటికి వచ్చిన బాలికను రూ.35,000 అప్పు తీర్చడానికి ఇంటికి వచ్చిన బాలికను ఆమె పెద్దమ్మ అమ్మేసింది. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి షాక్ అయ్యింది. తన కుమార్తెను విడిపించేందుకు అధికారులు, పోలీసులను ఆశ్రయించింది. దీంతో కొన్న వ్యక్తి నుంచి ఆ బాలికను కాపాడారు. కర్ణాటకలోని తుమకూరుకు చెందిన 11 ఏళ్ల బాలిక నాలుగో తరగతి చదువుతోంది. వేసవి సెలవుల నేపథ్యంలో ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురంలో ఉన్న పెద్దమ్మ సుజాత ఇంటికి వెళ్లింది. కూతురు వరుసైన ఆ బాలికను బాగా చూసుకుంటానని సోదరి చౌడమ్మకు ఆమె చెప్పింది. భూస్వామి శ్రీరాములు నుంచి సుజాత రూ.35,000 అప్పు తీసుకుంది. దీనిని తీర్చేందుకు కూతురు వరుసైన ఆ బాలికను అతడికి అమ్మేసింది. బాలికను నిర్బంధించిన శ్రీరాముడు బాతులను మేపే పనులు చేయిస్తున్నాడు. మరోవైపు బాలిక తల్లి చౌడమ్మ జూన్‌లో తన సోదరి సుజాత ఇంటికి వెళ్లింది. తన కుమార్తె శ్రీరాములు వద్ద పనులు చేయడం చూసి ఆమె షాక్ అయ్యింది. తన కూతురును విడిచిపెట్టాలని అతడిని ప్రాధేయపడింది. అయితే తన అప్పు చెల్లిస్తేనే బాలికను విడిచిపెడతానని అతడు చెప్పాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు హిందూపురం చేరుకుని బాలికను కాపాడారు. తుమకూరుకు తరలించి ఆమె తల్లికి అప్పగించారు. శ్రీరాములు, సుజాత, ఆమె భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పావురాల ఈకలు, రెట్టలతో అనారోగ్యం

- చిన్నారులు, యువత జాగ్రత్త ఉండాలి
- హైపర్సెన్సిటివిటీ న్యుమోనైటిస్ వచ్చే ప్రమాదం



ముందడుగు ప్రత్యేకం:
పావురాలను చాలామంది ఇళ్లల్లో పెంచుకుంటారు.. చాలా దేవాలయాలలో, మసీదులలో కూడా పావురాలు ఉంటాయి. అయితే పావురం ఈకలు, రెట్టలతో ప్రమాదమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఇది ఒక అధ్యయనం ద్వారా వెలుగులోకి వచ్చింది. పావురం ఈకలు, రెట్టలతో ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలను చూపుతుందని అధ్యయనంలో వెల్లడించింది. ముఖ్యంగా చిన్నారులు, యువత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

ఓ నివేదిక ప్రకారం.. ఈ అధ్యయనం ఢిల్లీలో ఒక అబ్బాయిపై చేశారు. పావురం ఈకలు, రెట్టలకు ఎక్కువగా గురికావడం వల్ల బాలుడు అలెర్జీకి గురయయాడు. అది అతనికి ప్రాణాంతకంగా మారింది. తూర్పు ఢిల్లీకి చెందిన 11 ఏళ్ల బాలుడిని సర్ గంగారామ్ ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు అధ్యయనానికి సంబంధించిన వైద్యులు తెలిపారు. మొదట్లో అతని లక్షణాలు సాధారణ దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో బాలుడి పరిస్థితి విషమంగా మారింది. బాలుడిని పరీక్షించగా.. హైపర్‌సెన్సిటివిటీ న్యుమోనైటిస్ (హెచ్‌పీ)తో బాధపడుతున్నట్లు తేలిందని పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) వైద్యులు తెలిపారు. దీంతో.. చిన్నారికి తక్షణ చికిత్స అందించాల్సిన పరిస్థితి నెలకొంది.

### హైపర్సెన్సిటివిటీ న్యుమోనిటిస్ అంటే ఏమిటి?

హైపర్సెన్సిటివిటీ న్యుమోనైటిస్ అనేది ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి అని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధితో బాధపడే వారు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతారు. యువతలో ఈ పరిస్థితి సర్వసాధారణమని, అయితే పిల్లల్లో మాత్రం ఇది చాలా అరుదని అంటున్నారు. ఈ వ్యాధి ఏడాదిలో లక్ష మంది జనాభాలో ఇద్దరు నుంచి నలుగురికి సోకుతుందని అంచనా.

### చిన్నారికి ఎలా చికిత్స అందించారు?

హైపర్ సెన్సిటివిటీ న్యూమోనైటిస్‌తో బాధపడుతున్న బాలుడికి స్టెరాయిడ్ మందు ఇచ్చామని వైద్యులు తెలిపారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే హై ప్రెజర్ ఆక్సిజన్ థెరపీ ఇచ్చారు. ఈ థెరపీ ద్వారా, ముక్కులో ట్యూబ్‌ను చొప్పించి శరీరానికి ఆక్సిజన్ పంపించారు. ఈ థెరపీ పిల్లల ఊపిరితిత్తులలో వాపును తగ్గించడంలో.. శ్వాసను సాధారణ స్థాయికి తీసుకురావడంలో సహాయపడిందని అధ్యయనంలో చెప్పారు. చికిత్స యొక్క సానుకూల ప్రభావాలు, ఇంటెన్సివ్ కేర్ సూచనల కారణంగా అతను ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యాడు.

### హైపర్సెన్సిటివిటీ న్యుమోనిటిస్ ఎందుకు వస్తుంది?

పక్షి రెట్టలు, ఈకలు.. కొన్ని పర్యావరణ పదార్థాలకు పదేపదే బహిర్గతం కావడం వల్ల హైపర్సెన్సిటివిటీ న్యుమోనైటిస్ పరిస్థితి ఏర్పడుతుందని డాక్టర్లు చెబుతున్నారు. అంతేకాకుండా.. ఈ-సిగరెట్ స్మోకర్ ద్వారా వెలువడే పొగతో కూడా అలాంటి పరిస్థితి తలెత్తవచ్చు. అందుకోసం పక్షి రెట్టలు, ఈకల వల్ల కలిగే అనర్థాలపై అవగాహనతో ఇలాంటి వ్యాధులను అరికట్టాలని వైద్యులు సూచిస్తున్నారు. పావురాలు, పౌల్ట్రీ పక్షులు చుట్టూ ఉన్నప్పుడు జాగ్రత్త వహించాలని అంటున్నారు.

ముందడుగు
ఆదివారం,
14-7-2024,
హైదరాబాద్.

# రూ.1000 కోట్ల క్లబ్‌లో కల్కి.. కర్ణుడి గెటప్‌లో ప్రభాస్ స్పెషల్ పోస్టర్ రిలీజ్




పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన తాజా బ్లాక్ బస్టర్ 'కల్కి' బాక్సాఫీస్ వద్ద తన జైత్రయాత్రను ఇంకా కొనసాగిస్తుంది. తాజాగా ఈ చిత్రం రూ.1000 కోట్ల క్లబ్‌లో ఎంటర్ అయినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా మూవీ నుంచి కర్ణుడి గెటప్‌లో ఉన్న ప్రభాస్ స్పెషల్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

ఈ సినిమా కేవలం 17 రోజుల్లోనే రూ.1000 కోట్ల మార్క్ టచ్ చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో తెలుగు ఇండస్ట్రీలో రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టిన చిత్రాలలో కల్కి మూడవ సినిమాగా నిలిచింది. ఇంతకుముందు ఈ రికార్డు బాహుబలి 2, ఆర్ఆర్ఆర్ పేరిటా ఉన్నాయి. యూనివర్శల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులు కొత్త అనుభూతిని పంచుతుంది. చాలా కాలం తరువాత థియేటర్లు ప్రేక్షకులతో కళ కళలాడుతున్నాయి. గత కొంతకాలంగా సినిమాలు లేక, సరైన కంటెంట్‌తో సినిమాలు రాక విసిగిపోయిన ప్రేక్షకులకు ఈ సినిమా కొత్త అనుభూతితో పాటు మంచి సినిమా చూశామన్న ఆనందాన్ని ఇచ్చింది. అందుకే ప్రేక్షకులు ఈ చిత్రానికి అత్యంత భారీ విజయాన్ని అందించారు. ముఖ్యంగా చిత్రంలో వున్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్, విజువల్స్ చూసి, తెలుగు సినిమా స్థాయిని ప్రశంసిస్తున్నారు. దీంతో పాటు ఈ చిత్రానికి సమయం కూడా కలిసొచ్చింది. ఈ మధ్య కాలంలో ఇంతటి భారీ స్థాయి సినిమా రాకపోవడంతో పాటు సినిమాకు లాంగ్ వీకెండ్ అడ్వాంటేజీగా మారింది. సినిమాలో కీలకంగా వున్న బుజ్జి కారు, ఇలా సినిమాలో పాటు చిన్నపిల్లల నుండి పెద్ద వాళ్ల వరకు అలరించే అంశాలు ఈ చిత్రంలో వుండటం కూడా మరో కారణం.

# ఇది అంతకుమించి



ఓటీటీలో సూపర్ క్రేజ్ తెచ్చుకున్న సిరీస్‌లలో మీర్జాపూర్ ఒకటి. పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, షెర్నావాజ్ సామ్ జిజినా తదితరులు నటించిన ఈ సిరీస్ మూడో భాగం స్ట్రీమింగ్ ఇటీవలే అమెజాన్ ప్రైమ్‌లో మొదలైంది. ప్రస్తుతం టాప్ 5లో ట్రెండింగ్ అవుతున్నది. కాగా, గత రెండు సీజన్లతో పోలిస్తే మూడో సీజన్‌ను భిన్నంగా తెరకెక్కించాడు దర్శకుడు.

ఈ సిరీస్‌లో ముఖ్యపాత్ర పోషించిన షెర్నావాజ్ సామ్ జిజినా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'మీర్జాపూర్ మూడో సీజన్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. నాలుగో సీజన్ కూడా ఉంటుంది. దానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నది. ఈ మూడు భాగాల కంటే మెరుగైన, ఆసక్తికరమైన స్క్రిప్ట్ తయారు చేస్తున్నారని అనుకుంటున్నాను. ప్రేక్షకులను అలరించే మరిన్ని అంశాలు నాలుగో భాగంలో ఉంటాయని ఆశిస్తున్నాను. అన్ని సీజన్లలోనూ హింస ఉండకూడదు. అందుకే బలమైన రాజకీయ కోణంతో మూడో సీజన్ తెరకెక్కింది' అని చెప్పుకొచ్చింది షెర్నావాజ్.

# ఓటీటీ యూటర్న్

ఓటీటీ వచ్చిన తర్వాత నిర్మాతలకు మంచి రోజులు వచ్చాయనే చెప్పాలి. చిన్న, మధ్యస్థాయి సినిమాలు కూడా ఓటీటీ పుణ్యమా అని డబ్బులు రాబట్టుకుంటున్నాయి. ఇక, కొన్ని సినిమాలు అయితే నేరుగా ఓటీటీలో విడుదలై సంచలనం సృష్టిస్తున్నాయి. ప్రస్తుతం ఆ పరిస్థితులు మారుతున్నాయని చెప్పుకొచ్చింది తాప్సీ పన్ను. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో కొన్ని ఇంతకుముందులా అన్ని సినిమాలు తీసుకునేందుకు ఆసక్తి చూపించడం లేదని పేర్కొన్నది. 'స్టార్ నటీనటులు లేకపోయినా, బాక్సాఫీస్ దగ్గర అంతగా కలెక్షన్లు రాకపోయినా.. ఓటీటీ ఉందన్న ధైర్యం నిర్మాతలకు ఉండేది. అయితే, ఇప్పుడు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ యూటర్న్ తీసుకుంటున్నాయి. ప్రతి సినిమాను కొనుగోలు చేసి స్ట్రీమింగ్ చేయలేమని చెబుతున్నాయి. స్టార్ నటులు లేని సినిమాలను ప్రమోట్ చేయలేమని చేతులు ఎత్తేస్తున్నాయి చిన్న సినిమాలను ప్రేక్షకులు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో చూసేలా ఆకర్షించడం కష్టమని అంటున్నాయి. ఎంతో కొంత ప్రమోషన్ చేసి థియేటర్లలో విడుదల చేయాలని, ఆ తర్వాత కొన్నిరోజులకు ఆ సినిమాను ఓటీటీలో స్ట్రీమింగ్‌కు తీసుకుంటామని స్పష్టంగా చెప్పేస్తున్నాయి' అని చెప్పుకొచ్చారు తాప్సీ.

